PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :206 | పేజీలు : 8 | వెల రూ.5 | బుధవారం 19.08.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




# ఎంసీఆర్ టిమ్స్‌లో.. సూపర్ వైద్యం!

## రోజూ 4వేల మందికి ట్రీట్‌మెంట్

సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆసుపత్రిలో విదేశీ రోగుల కోసం తొలి సారిగా ప్రత్యేక వార్డులను అందుబాటులోకి తెచ్చారు. మొదటి దశలో 582 పడకలతో సేవలు ప్రారంభించనున్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఆస్పత్రి ప్రారంభమైంది. ప్రైవేట్ ఆసుపత్రులతో పోలిస్తే టిమ్స్ విదేశీ రోగులకు చాలా తక్కువ ధరలకే సేవలను అందించనుంది. ఈ సేవలు రెండో దశలో అందుబాటులోకి రానున్నాయి. పేదలకు సేవలు పూర్తిగా ఉచితంగా ఉంటాయి. ఆసుపత్రి నిర్వహణ, మౌలిక సదుపాయాల ఖర్చులను భరించడానికి విదేశీ రోగుల నుంచి వచ్చే ఆదాయంతో పాటు నిమ్స్ తరహాలో 200 పడకలను పేయింగ్ రోగులకు కేటాయించనున్నారు. టిమ్స్ సనత్‌నగర్‌ను ప్రధానంగా కీలక వైద్య విభాగాలకు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా అభివృద్ధి చేశారు. 37 విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు అందిస్తుండగా.. ఈ ఆసుపత్రి కొన్ని ప్రధాన వైద్య సమస్యలకు సంబంధించిన చికిత్స, పరిశోధనలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది.

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు

సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిలో 37 విభాగాలు
కీలక వైద్య విభాగాలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
16 అదునాతన ఆపరేషన్ థియేటర్ల
పేదలకు పూర్తి ఉచితంగా వైద్య సేవలు
ప్రత్యేకతలు, సూపర్ 'స్పెషాలిటీ'లు ఇవే..



- తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలకు చికిత్స, శస్త్ర చికిత్సల కోసం కార్డియాక్, థొరాసిక్ సైన్సెస్ విభాగాలను ఏర్పాటు చేశారు.
- మూత్రపిండాలు, కాలేయం, గుండె మార్పిడి సహా అవయవ మార్పిడి కోసం ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు.
- మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు, చికిత్సలు, పరిశోధనల కోసం నెఫ్రాలజీ, యూరాలజీ విభాగంలో ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు.
- క్లిష్టమైన 'గోల్డెన్ అవర్' సమయంలో రోగులకు సకాలంలో సహాయం అందించడానికి 24 గంటల ట్రామా కేర్ సేవలు అందించనున్నారు.

### అత్యాధునిక విభాగాలు..

- అత్యవసర పరిస్థితుల్లో కూడా సంక్లిష్టమైన చికిత్సలు అందించడానికి 300కు పైగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) పడకలు అందుబాటులో ఉన్నాయి.
- అన్ని రకాల క్లిష్టమైన శస్త్ర చికిత్సల కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఎంఆర్ఐ, సిటీ స్కాన్ సౌకర్యాలు, రోబోటిక్ సర్జరీ సామర్థ్యాలతో కూడిన 16 అధునాతన ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు.
- అవయవ మార్పిడి సౌకర్యాల్లో అత్యాధునిక మాడ్యులర్ థియేటర్లు, ప్రయోగ శాలలు, ఇన్‌ఫెక్షన్ రహిత ఐసీయూలు, ప్రత్యేక వార్డులు ఉన్నాయి.
- తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులను ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లకు వేగంగా తరలించడానికి ప్రత్యేక రవాణా మార్గాలు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. వీటితో పాటు విభాగాల మధ్య వైద్య నమూనాలను బదిలీ చేయడానికి ఒక ప్రత్యేక సాంకేతిక వ్యవస్థ కూడా ఉంది.


నిర్మాణ వ్యయం ₹1,070 కోట్లు
విస్తీర్ణం: 22.6 ఎకరాలు
బ్లాక్‌లు: 3, అంతస్తులు: 5
మొత్తం పడకలు: 1,082

### రోజుకు 4 వేల మందికి వైద్య సేవలు ..

24 గంటల పాటు అందుబాటులో ఉండేలా అంబులెన్సు సేవలు, డయాగ్నోస్టిక్స్, రోగులు ఎక్కువ సేపు క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, నర్స్ కాలింగ్ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఏడాది మే నుంచే ఓపీ ట్రయల్ రన్‌ను నిర్వహిస్తుండగా, రోజుకు దాదాపు 300 మందికి చికిత్స అందిస్తున్నారు.



## మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష.. పొంగులేటిపై హరీశ్ ఫైర్



మల్కాజిగిరి, ఆగస్టు 18, :ప్రభాత సూర్యుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష? పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30% గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30% కమీషన్ అడుగుతున్నారు' అంటూ విరుచుకుపడ్డారు.రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్టర్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్ట్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అధికారులూ జాగ్రత్త.. మీరు తప్పు చేస్తే రేపు మీరే బలవుతారు.

## బీజేపీకి అనుబంధ సంస్థగా మారిన ఎన్నికల సంఘం: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు: 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం



చేశారు.కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు.దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వశ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.



ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు | జాతీయ తెలుగు దినపత్రిక



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు:తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను లష్కర్ గూడలో ఘనంగా నిర్వహించారు.
లష్కర్ గూడ గౌడ సంఘం ఆధ్వర్యంలో, మాజీ ఎంపీటీసీ సీక సాయికుమార్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులు, మాజీ వార్డు సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్మరించుకుంటూ ఆయన సేవలను కొనియాడారు.




# ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం రక్షణ కోసం ఆదివాసులు అస్తిత్వ పోరాటం చేయాలి

**ఆదివాసి సంక్షేమ పరిషత్**
**ములుగు జిల్లా అధ్యక్షులు పర్శిక సతీష్**

ములుగు ఆగస్టు 18 ప్రభాత సూర్యుడు ఏటూరునాగారం ఐటీడీఏ పిఓ వారికి షెడ్యూల్డ్ ఏరియాలో 1/70 చట్టం రక్షణ కోసం వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పర్శిక సతీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం రక్షణ కోసం అస్తిత్వ పోరాటం అనేది ఆదివాసుల భూమి, హక్కులు, జీవనాధారం రాజ్యాంగ పరిరక్షణ కోసం చట్టబద్ధమైన ప్రజా ఉద్యమంగా ముందుకెళ్లాలని వెళ్లాలన్నారు. 1/70 నిబంధనలు షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజన భూముల అన్యాక్రాంతాన్ని నిరోధించేందుకు రూపొందించబడ్డాయి. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులు 1/70 చట్టాన్ని రద్దు చేయాలని కుళ్లు కుతంత్రాలతో కోర్టులలో కేసులు వేశారు. ఆ కేసులు వేసిన గిరిజనేతరలను ఏజెన్సీ వలస నిరోధక చట్టాన్ని అమలు చేసి ఏజెన్సీ ప్రాంతం నుంచి వెళ్ళగొట్టాలన్నారు. 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి.గిరిజన భూముల అక్రమ బదలాయింపులు, ఆక్రమణలను వెంటనే గుర్తించి రద్దు చేయాలి.అన్యాక్రాంతమైన గిరిజన భూములను చట్ట ప్రకారం తిరిగి గిరిజనులకు అప్పగించాలి.ప్రభుత్వ భూముల అక్రమ ఆక్రమణలను అరికట్టాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పరిరక్షణలను సమర్థంగా అమలు చేయాలి. గ్రామసభలు, పేసా చట్టం ద్వారా ఆదివాసుల స్వపరిపాలన హక్కులను బలోపేతం చేయాలి.చట్టాల అమలులో నిర్లక్ష్యం చేసే అధికారులపై బాధ్యత పరంగా చర్యలు తీసుకోవాలి. అని ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ కు పలు డిమాండ్లతో వినతి పత్రం అందజేయటం జరిగింది.భూమి కోసం కాదు అస్తిత్వం కోసం,1/70 చట్ట రక్షణ కోసం ప్రతి ఆదివాసి ఒక్కటవ్వాలి! ఆదివాసి సమాజానికి పిలుపునిచ్చారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజన గ్రామాలు గుడాల్లో ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా సరైన అంతర్గత రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్లు బురద మాయంగా మారటంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం రైతులు వ్యవసాయం ఉత్పత్తుల మార్కెట్ కు తరలించడం అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లడం కూడా కష్టతరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి గిరిజన గూడెం , నివాస ప్రాంతాల్లో ఇంటర్నల్ సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల దశలవారు ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు, సోడి గోపి,చందా సూరిబాబు, మీడియం అర్జున్ తదితరులు పాల్గొన్నారు.




# కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలి..

**ఎంపీడీవో కార్యాలయం ఎదుట రిలే దీక్షలు**
**కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్.**




కారేపల్లి ఆగస్టు 18ప్రభాత సూర్యుడుగ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి మండలంలోని 41 గ్రామపంచాయతీలకు చెందిన కార్మికులు మంగళవారం సమ్మె చేపట్టారు.తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట టెంట్ ఏర్పాటు చేసి రిలే దీక్షలు నిర్వహించారు.సీఐటీయూ సింగరేణి మండల కన్వీనర్ కే.నరేంద్ర కార్మికులకు పూలమాలలు వేసి రిలే దీక్షలను ప్రారంభించారు.యూనియన్ మండల కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరేంద్ర మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో కాంగ్రెస్ నాయకులు వారి పోరాటానికి మద్దతు తెలిపారని గుర్తు చేశారు. కార్మికుల డిమాండ్లు న్యాయమైనవని,అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని,మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని,జీవో నంబర్ 51ను సవరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లకు పైగా గడుస్తున్నా హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు.గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని,జీవో నంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని,కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా వేతనాలను నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు.అక్రమంగా కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్న గ్రామపంచాయతీల సర్పంచులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విధుల్లో ఉంటూ మరణించిన గ్రామపంచాయతీ కార్మికుల దహన సంస్కారాలకు కనీసం రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు.గ్రామపంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు,ఇంటి స్థలాలు,డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రస్తుతం సమస్యల పరిష్కారం కోసం రెండు రోజుల సమ్మె చేపట్టామని,ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో సుదీర్ఘ సమ్మెతో పాటు ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నరేంద్ర హెచ్చరించారు.పరిస్థితి తీవ్రతరం అయితే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఈ సమ్మె,రిలే దీక్షల్లో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే హుస్సేన్,మండల కోశాధికారి గుగులోతు శ్రీను,నాయకులు బోళ్ల కొమరయ్య,పాలిక తిరపయ్య,యాదగిరి, ఉపేందం ్,సుల్తానా,హేమచంద్,సుక్య,అచ్చయ్య,హిట్లర్,మంగీలాల్ తదితరులతో పాటు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులు యాంటీ ర్యాగింగ్ కు దూరంగా ఉండాలి

**యాంటీ ర్యాగింగ్ పాల్పడే విద్యార్థినీ విద్యార్థులు శిక్షార్హులు**
**డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ హావిలా.**

భద్రాచలం ఆగస్టు 18 ప్రభాత సూర్యుడు కళాశాలలో గాని ఇతర విద్యాసంస్థలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలే కానీ యాంటీ ర్యాగింగ్ వంటి పనుల వలన ఇతర విద్యార్థిని విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగి వారి జీవితాన్ని పాడు చేసినట్లు అవుతుందని భద్రాచలం డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి హావీలా విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. మంగళవారం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తిలో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల సందర్భంగా యాంటీ ర్యాగింగ్ పై విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఉందని ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ కు గురి అయినట్లయితే వచ్చి కంప్లైంట్ ఇవ్వొచ్చని, యాంటీ ర్యాగింగ్ సెల్ వారు విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారని అన్నారు. సీనియర్ విద్యార్థులు కళాశాలకు వచ్చే జూనియర్ విద్యార్థుల పట్ల ప్రేమానురాగాలు మమతాను బంధాలతో మమేకమై కలిసి చదువుకోవాలని అన్నారు. సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ స్వప్న మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థులు చదువులకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ఇతరులను ర్యాగింగ్ చేయొద్దని అనవసరమైన విషయాలను జోక్యం చేసుకొని పోలీస్ స్టేషన్ వరకు పరిస్థితులను తెచ్చుకోవద్దని ఉద్బోధించారు. విద్యార్థినిలు ప్రతి విషయానికి భయపడద్దని కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇచ్చేటువంటి సూచనలను తీసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాంబాబు, డాక్టర్ రాగ సుమ,డాక్టర్ నాగ సమీరా, సుధాకర్, రమేష్, పూర్ణిమ మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటి లభ్యతకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలి

**రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పించాలి**
**రైతుల సమస్యలు, సూచనలను స్వయంగా అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**
**సమస్యల పరిష్కారంలో స్పష్టమైన పురోగతి ఉండాలి**

ములుగు, ఆగస్టు 18, ప్రభాత సూర్యుడు నూతన కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో సంయుక్త సలహా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, సాగునీటి లభ్యత, పంటల సాగు పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా రైతులతో మాట్లాడి ఆయా మండలాలు, గ్రామాల్లో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులు, సాగునీటి సమస్యలు, పంటల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రత్యామ్నాయ పంటలపై వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలిపిన ప్రతి అంశాన్ని అధికారులు నమోదు చేసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ములుగు జిల్లాలో అత్యధిక శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నందున రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారులు ఒకే వేదికపై చర్చించడం ద్వారా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలకు సరైన పరిష్కార మార్గాలను గుర్తించవచ్చన్నారు.





మే నెల నుంచే ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు పరిస్థితులపై రైతులకు రైతు వేదికలు, ప్రచార మాధ్యమాల ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి లభ్యతను అంచనా వేసుకోకుండా పంటలు సాగు చేసి రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆగస్టు నెలలో జిల్లాలో వర్షపాతం తీవ్రంగా తగ్గిందని కలెక్టర్ గారు తెలిపారు. జిల్లా మొత్తంగా సాధారణ వర్షపాతం 218 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 83 మిల్లీమీటర్లు మాత్రమే నమోదై, సుమారు 62 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రస్తుత పరిస్థితులను రైతులు గమనించి నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.రైతులు పూర్తిగా వరి పంటపైనే ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొంత విస్తీర్ణంలో వరి సాగు చేస్తూనే మిగతా భూముల్లో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను చేపట్టడం ద్వారా వర్షాభావ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చన్నారు.ఆయా ప్రాంతాల నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను బట్టి ఏయే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చనే అంశంపై రైతులకు పూర్తి సమాచారం అందించాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అన్ని రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులతో సమావేశాలు నిర్వహించి, రైతులకు అనుకూలమైన పంటలు, సాగు విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

# గొండ్వాన సంక్షేమ పరిషత్ పాదయాత్రకు సపూర్ణ మద్దతు పలికిన ఏ ఎన్ ఎస్


**ఐదో షెడ్యూల్ పరిపాలన అమలు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన.**
**ఏ ఎన్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు**

ములుగు ఆగస్టు18 ప్రభాత సూర్యుడు 1/7 చట్టాన్ని ఐదో షెడ్యూల్ ఏరియాలో పటిష్టంగా అమలు చేయాలనీ గొండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఏదిరా నుండి కొనసాగుతున్న పాదయాత్రకు ఆదివాసీ నవనిర్మాణ సేన సంపూర్ణ మద్దతు ప్రకటించినట్టు ఆ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేసారు. ఐదో షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీల హక్కులు, చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని అందుకు పాలక ప్రభుత్వాల లోపభూయిష్ట విధానలే కారణం అని అన్నారు. గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సొంది వీరయ్య చేపట్టిన ఈ పాదయాత్ర కుభారీగా ప్రజా స్పందన లభిస్తోందని అన్నారు. ఆరుపదుల వయసులో కూడా సొందే వీరయ్య పాదయాత్ర చేపట్టడం ఆదివాసీ ప్రజల పట్ల ఆయనుకున్న చిత్త శుద్ధి అలాంటిది అని కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ బద్దంగా ఏర్పడిన ఐదో షెడ్యూల్ ప్రాంత ప్రయోజనాలను, పరిపాలనను విస్మరించడం పట్ల అయన ఆగ్రహం వ్యక్తం చేసారు. షెడ్యూల్ ప్రాంతంలో మైదాన ప్రాంత పరిపాలన కొనసాగిచడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు**
**ప్రభుత్వ దావఖానా సమస్యలపై సిపిఐ(ఎం) సర్వే**

కారేపల్లి ఆగస్టు 18 ప్రభాత సూర్యుడు ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన వైద్యులు, సిబ్బంది, మందులు, వైద్య పరికరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.మంగళవారం కారేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో నెలకొన్న సమస్యలపై సీపీఎం బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది, మందుల లభ్యత, వైద్య పరికరాలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.ఏజెన్సీ ప్రాంతంలో పేద, గిరిజన ప్రజలు ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడుతున్నారని, అయితే ఆసుపత్రిలో ఎక్స్రే తదితర రోగ నిర్ధారణ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి,మాణిక్యారం చీమలపాడు ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పి హెచ్ సి ని మంజూరు చేయాలని అవసరమైన వైద్య పరికరాలు, వైద్యులు, సిబ్బంది, 102 అంబులెన్స్ సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని ఖాళీగా ఉన్న మహిళా డాక్టర్, ఫార్మాసిస్ట్, సూపర్వైజర్ పోస్టల్ భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అత్యధిక జనాభా కలిగి మారుమూల ప్రాంతాల ఏజెన్సీ ప్రజల ప్రభుత్వ వైద్యం అందించుటకు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా వైద్యశాఖ ఉన్నత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (పి హెచ్ సి) నీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి హెచ్ సి) గా అప్ గ్రేడ్ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు ఈ సర్వేలో పార్టీ మండల కార్యదర్శి కే నరేంద్ర నాయకులు వజ్జా రామారావు, యనమనగండ్ల రవి, కొండబోయిన ఉమావతి, బానోత్ బన్సీలాల్,తలారి దేవ ప్రకాష్,కేశగాని ఉపేందర్, ముక్కా సీతారాములు, దాసరి మల్లయ్య, అజ్మీర్ శోభన్, రేగళ్ల మంగయ్య, ముండ్ల ఏకాంబరం, పండగ కొండయ్య, ఎండి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఎఫ్ ఎల్ ఎన్ తో శ్వాస పీల్చాలి.. ఎఫ్ ఎల్ ఎన్ తో శ్వాస వదలాలి..

**భద్రాచలం ఎంఈఓ బెక్కంటి శ్రీనివాసరావు**



భద్రాచలం ఆగస్టు 18 ప్రభాత సూర్యుడుప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులందరూ బోధనలో విద్యార్థి కేంద్రంగా చేసుకొని ఎఫ్.ఎల్.ఎన్ తో శ్వాస వీల్చు పీల్చుకొని ఎఫ్. ఎల్.ఎం తో శ్వాస విడిచే అంత ప్రాముఖ్యత తో ప్రాథమిక విద్యా బోధన ఉండాలని మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.మంగళవారం భద్రాచలం మండల రిసోర్స్ కేంద్రం లో మండల విద్యాశాఖ అధికారి అధ్యక్షతన ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, కేజీబీవీ, ఎయిడెడ్ ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి పాఠశాల స్థాయిలో గుణాత్మకమైన విద్య సాధించడానికి తరగతి గదిలో అభ్యసనా సామర్థ్యాలను విద్యార్థి కేంద్రంగా చేసుకొని ఎలా సాధించాలో సుమారు రెండు గంటల పాటు ప్రధానోపాధ్యాయులు అందరికీ శిక్షణ నిర్వహించారు.బుధవారం గురువారం మండలం లోని కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించే కాంప్లెక్స్ సమావేశాలలో తీసుకోవాల్సిన, పాటించాల్సిన,బోధించాల్సిన పలు అంశాలపై కాంప్లెక్స్ హెడ్మాస్టర్లకు సూచనలు చేశారు.ఈ నేపథ్యంలో ఈ ఏడాది మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో నమోదు అత్యధికంగా సాధించిన జాన్సన్( గవర్నమెంట్ హై స్కూల్ ), ౦.రమా( జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల ), రాజా శ్రీనివాస్( మండల ప్రాథమికోన్నత పాఠశాల జగదీష్ కాలనీ), పాపయ్య ( ప్రాథమిక పాఠశాల తాత గుడి సెంటర్ )లి ప్రధానోపాధ్యాయులకు ఘన సన్మానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి లు గోపి, ఆర్ కె, సిసి బేబీ, ఐ ఈ ఆర్ పి వా. పద్మ ఏ పి ఎం తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతాలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి. మంత్రి సీతక్క

### గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు లీడ్ తీసుకోవాలి
### పిసా చట్టం కల్పించిన ప్రత్యేక అధికారాలను సద్వినియోగం చేసుకోవాలి








ములుగు ఆగస్టు 18 ప్రభాత సూర్యుడు ఏజెన్సీ ప్రాంతాలను దేశానికే ఆదర్శంగా నిలిచే గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు నాయకత్వం వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు.మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎంసిఆర్ హెచ్‌ఆర్ డీలో కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళా సర్పంచులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిసాచట్టం, గ్రామసభల ప్రాధాన్యత, సర్పంచుల విధులు, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై సర్పంచులకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సాధారణ గ్రామపంచాయతీలకు, షెడ్యూల్డ్ ఏరియా గ్రామపంచాయతీలకు చాలా తేడా ఉంటుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులు, అక్కడి ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకొని పాలన సాగించాల్సిన అవసరం ఉందన్నారు. పిసా చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల గ్రామసభలకు ప్రత్యేక అధికారాలు కల్పించారని, వాటిని సర్పంచులు పూర్తిగా అర్థం చేసుకొని ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలని సూచించారు. అడవులను, ప్రకృతిని తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న ఆదివాసీలకు వారి హక్కులపై పూర్తి అవగాహన ఉండాలని మంత్రి అన్నారు. గ్రామసభ నిర్ణయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, గ్రామానికి సంబంధించిన అభివృద్ధి, వనరుల వినియోగం వంటి అంశాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని చెప్పారు. పీసా చట్టం ఇచ్చిన అధికారాలను తెలుసుకోవడం మాత్రమే కాకుండా, వాటిని ఆచరణలో పెట్టడం కూడా ముఖ్యమని స్పష్టం చేశారు.మీరు కేవలం సర్పంచులుగా కాకుండా.. మీ గ్రామాల మార్గదర్శకులుగా నిలవాలి. ఐదేళ్ల పదవీకాలాన్ని ప్రజల జీవితాల్లో శాశ్వతమైన మార్పు తీసుకువచ్చే అవకాశంగా భావించాలి. ఈ మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాలకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలి అని సీతక్క అన్నారు. ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. గ్రామాల్లో సొంత ఆదాయ వనరులను పెంచుకోవాలని, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను కూడా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. రోడ్లు, భవనాలు నిర్మించడం మాత్రమే అభివృద్ధి కాదని.. ప్రజలకు ఆదాయం పెరగడం, ఉపాధి అవకాశాలు పెరగడం, పిల్లలు చదువుకోవడం, ఆరోగ్యం మెరుగుపడటం, మహిళలు ఆర్థికంగా ఎదగడం కూడా అభివృద్ధిలో భాగమేనన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజల ఆదాయం పెంచేందుకు ఉపాధి హామీ కార్యక్రమాలను అనుసంధానం చేసుకోవాలని మంత్రి సూచించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను గుర్తించి ప్రజలకు కల్పించాలని అధికారులను ఆదేశించారు.గ్రామసభలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా సామాజిక మార్పునకు వేదికలుగా ఉపయోగించుకోవాలని సీతక్క అన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడం, మహిళలపై వేధింపులు లేకుండా చూడటం, పిల్లల విద్యను ప్రోత్సహించడం, పోషకాహారం, ఆరోగ్యం వంటి అంశాలపై గ్రామసభల్లో చర్చించి ప్రజలతో సామూహిక నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఒక గ్రామసభలోనే మన గ్రామంలో ఇకపై ఒక్క బాల్య వివాహం కూడా జరగకూడదని తీర్మానం చేసుకోవచ్చు. మహిళలకు ఎలాంటి వేధింపులు ఉండకూడదని నిర్ణయించుకోవచ్చు. ఇలాంటి సామాజిక మార్పులకు గ్రామసభలను ఉపయోగించుకోవాలి అని మంత్రి తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో సంప్రదాయ ఆహారాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీతక్క కోరారు. ఇప్పపువ్వు లడ్డూ, మిల్లెట్స్ బిస్కెట్లు వంటి స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయ ఆహారంతో పాటు మహిళలకు, స్థానిక కుటుంబాలకు ఆదాయ మార్గాలు కల్పించవచ్చని చెప్పారు. ఆరోగ్యం ప్రకృతితో ముడిపడి ఉండేలా సంప్రదాయ ఆహార విధానాలను ప్రోత్సహించాలని సూచించారు.రాజకీయాలకు అతీతంగా పాలన సాగించాలని, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సర్పంచులకు మంత్రి సూచించారు. ప్రజల కష్టాలను గుర్తించి, అత్యవసర పరిస్థితుల్లో వారికి అండగా నిలవాలని అన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండటం సర్పంచుల విజయానికి ముఖ్యమైన అంశమని చెప్పారు.ఏజెన్సీ ప్రాంతాల మహిళా సర్పంచులు తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని మంత్రి ఆకాంక్షించారు. మంచి పనితీరుతో గ్రామాలను అభివృద్ధి చేస్తే రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు, పురస్కారాలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు.ఈ మూడు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకొని ప్రతి సర్పంచు తన గ్రామానికి ఏం చేయాలనే దానిపై ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. నేర్చుకోవడం, గతంలో చేసిన పనులను సమీక్షించుకోవడం, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడం

ఈ శిక్షణ లక్ష్యంగా ఉండాలని చెప్పారు.ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. మీరు లీడ్ తీసుకోండి.. మీ గ్రామాలను ముందుకు తీసుకెళ్లండి.. ప్రభుత్వం మీ వెంటే ఉంటుంది అని సర్పంచులకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంసిఆర్ హెచ్‌ఆర్ డి డీజీ శాంతికుమారి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, శిక్షణ కార్యక్రమ కోఆర్డినేటర్ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమం అనంతరం మంత్రి సీతక్కను శాంతికుమారి సన్మానించారు.

మంత్రి సీతక్క తో మహిళా సర్పంచుల గ్రూప్ ఫోటో దిగారు. ఇలాంటి కార్యక్రమాలు సర్పంచు లందరికి నిర్వహించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# విద్యార్థులో సృజనాత్మకతను, శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించిన ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

### రేలకాయపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





కారేపల్లి ఆగస్టు 18 ప్రభాత సూర్యుడు .విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.మంగళవారం సింగరేణి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ కారేపల్లి-- రేలకాయపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల ప్రవేశాలు, విద్యా ఫలితాలు, వారికి అందుతున్న భోజనం, వసతులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్ బోధనా తీరును పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో ఆసక్తి చూపుతున్నారు, వారి భవిష్యత్ లక్ష్యాలు ఏమిటి, ఉన్నత విద్యలో ఏ కోర్సులను ఎంచుకోవాలని భావిస్తున్నారు, భవిష్యత్‌లో ఏ రంగాల్లో స్థిరపడాలనుకుంటున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు.పాఠశాలలోని లైబ్రరీ, మ్యూజిక్ రూమ్, ఆర్ట్స్ గ్యాలరీ, సైన్స్ ల్యాబ్ లను కలెక్టర్ పరిశీలించారు. సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థులు రూపొందించిన వివిధ ఆవిష్కరణలను తిలకించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు.ప్రస్తుతం పోటీ ప్రపంచంలో కేవలం విద్యార్హతలు మాత్రమే కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు వంటి నైపుణ్యాలు ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, వివిధ ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.విద్యాధికారులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశంఅనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యాలయ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రగతి, మౌళిక వసతులు, సిబ్బంది, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్షించారు.పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ఖమ్మం-- చీమలపాడు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పాఠశాల భవనం ప్రహరీ గోడపై సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేయాలని, పాఠశాల ప్రాంగణంలో అదనపు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అంశాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భద్రతకు, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.మౌళిక వసతుల అభివృద్ధికి చర్యలుపాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు, విద్యా సదుపాయాలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, విద్యా సామగ్రి, ప్రయోగశాలలు, లైబ్రరీ, క్రీడా సదుపాయాలు, విద్యుత్, తాగునీరు తదితర వసతులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, నాణ్యమైన ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను అధికారులు, పాఠశాల సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.సుమారు 9.57 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతుండగా, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి,

వారిలోని ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకునేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించే దిశగా క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల కబ్జా పై విచారణ చేపట్టండి

### కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి
### పాలెం వాగు ప్రాజెక్ట్ నీటి సామర్థ్యన్ని పెంచండి
### కౌలు రైతులకు అన్యాయం జరుగుతోంది
### ప్రధాన కాలువను బాగుచేయండి

ములుగు ఆగస్టు 18 ప్రభాత సూర్యుడుఎల్ టి ఆర్ చట్టాన్ని బేఖాతారు చేస్తూ వలస గిరిజనేతరులు వేలాది ఎకరాలు ప్రభుత్వ భూమిని పట్టాలు చేసు కుంటున్నారు ఇది ఐదో షెడ్యూల్ కు విఘాతం కలిగిస్తోందని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి జిల్లా కలెక్టర్ హేమంత్ ను మంగళవారం కలిసి వివరించారు.మంగళవారం నూతన జిల్లా కలెక్ట్రెట్ లో జిల్లా కలెక్టర్ హేమంత్ అధ్యక్షతన జరిగిన ఎల్ నీనో ప్రభావం, పంటల మార్పిడి, నీటి యాజమాన్యం పై జరిగిన వివిధ శాఖల అవగాహనా సదస్సులో నర్సింహా మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాలెం వాగు ప్రాజెక్ట్ కాలువ అనేక గండ్లు పడి దిగువ ప్రాంత రైతులకు సాగు నీళ్లు వచ్చే పరిస్థితి లేదని కాలువ మరమ్మత్తు పనులు చేపట్టాలని తెలిపారు. డిస్టబ్యూటర్లకు గేట్లు లేకపోవడం తో నీరంతా వృధా అవుతోందన్నారు. చిన్నగాంగారం దెగ్గర ప్రధాన కాలువకు బుంగపడి నీళ్లు అన్ని వాగులోకి వెళ్తునట్టు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పదివేల ఎకరాలకు సాగు నీళ్లు అందించే ప్రాజెక్ట్ కు ఒక లస్కర్ ని పెట్టడం వల్ల సమస్యలు పరిస్కారం అవ్వడం లేదు అన్నారు. ప్రాజెక్ట్ అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల మెయింటనెయన్స్ సమస్యలు తలెత్తుతున్నట్టు పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గడిసిన రెండేళ్లుగా వేలాది ఎకరాల పంటలు ఎండిపోయినట్టు వివరించారు. కాలువలో పూడిక తియ్యాలని తెలిపారు.ప్రభుత్వ తెచ్చిన ఎరువుల డిజిటల్ ప్రక్రియ ఏజెన్సీ రైతులకు కష్టంగా మారినట్టు తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొని రైతులు అనేకమంది ఉన్నారని అన్నా రు. ఇప్పటికే అరకొర వర్షాలతో ఇబ్బంది పడుతున్న అన్నదాతలకు ఎల్ నీనో కంటే పెద్ద సమస్య గా ఎరువుల ఆన్లైన్ విధానం ఉందని అన్నారు. నిరక్ష్య రాష్యత అమాయకత్వం కలిగిన ఏజెన్సీ రైతులకు సులభ తరంగా ఎరువులు అందేలా



చొరవ చూపాలన్నారు. వాజేడు వెంకటాపురం ఏజెన్సీ మండలాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, గిరిజనుల భూములను వలస గిరిజనేతరులు కబ్జా చేసి వంశ పారాపర్యంగా పట్టాలు పొందినట్టు తెలిపారు. 1970 తరవాత ఏజెన్సీ ఏరియాలో వలస గిరిజనేతరులకు పట్టాలు చేయకూడదు అని చట్టం తెలుపుతున్నప్పటికి ప్రస్తుతం పట్టాలు చేస్తున్నారని కలెక్టర్ కు ఫిర్యాదు చేసారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం పైన సమగ్ర విచారణ చేపట్టి వలస గిరి జనేతరుల అక్రమ పట్టాలు రద్దు చెయాలనీ అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, మహిళా నాయకులు ముర్రం రామలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.




# ఎవరు ఈ శ్వాసిక?

# ఆకాశానికెత్తేసిన మాస్ మహారాజా!

సౌత్ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి, మోడల్ కం టెలివిజన్ యాంకర్ శ్వాసిక విజయ్.సౌత్ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి, మోడల్ కం టెలివిజన్ యాంకర్ శ్వాసిక విజయ్. చిన్ననాటి నుంచే శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందిన ఈ భామ తన నటనా ప్రతిభతో మలయాళం, తమిళం, తెలుగు చిత్ర పరిశ్రమల్లో విభిన్నమైన పాత్రలను పోషించే అవకాశం దక్కించుకుంది. ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తున్న శ్వాసిక ప్రతి సినిమాలోనూ తనదైన ముద్ర వేస్తూ నటిగా మంచి క్రేజ్ సంపాదించుకుంది. శ్వాసిక నటనా జీవితంలో మలయాళ చిత్రం -వాసంతి- అత్యంత కీలకమైనది. ఈ సినిమాలో కనబరిచిన అద్భుతమైన అభినయానికి గాను కేరళ రాష్ట్ర ఉత్తమ సహాయ నటిగా అవార్డును అందుకుని విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ఆ తర్వాత -చతురం- సినిమాతో విశేష ప్రజాదరణ పొందింది. అంతేకాకుండా మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్‌తో కలిసి లూసిఫర్, ఇట్టిమాని, ఆరట్టు వంటి భారీ చిత్రాలలో నటించి మెప్పించింది. తమిళంలో -వైగై-, -సత్తై- వంటి చిత్రాల ద్వారా గుర్తింపు పొందిన శ్వాసిక డబ్బింగ్ చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరైంది. తాజాగా మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో తెరకెక్కిన -ఇరుముడి- సినిమాలో శ్వాసిక ఒక కీలక పాత్రలో నటించారు. కథాగమనంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న భావోద్వేగపూరితమైన పాత్రను ఈ సినిమాలో ఆమె పోషించారు. ప్రధాన కథానాయిక ప్రియా భవానీ శంకర్ తో పోటీపడుతూ నటించారు.






ఇటీవల ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో మాస్ మహారాజా రవితేజ పాల్గొని సినిమా విశేషాలను షేర్ చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్వాసిక నట ప్రతిభ గురించి రవితేజ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ తనపై ప్రశంసల వర్షం కురిపించారు. సెంటిమెంట్ -ఇరుముడి- సినిమాలో శ్వాసిక అభినయం గురించి రవితేజ మాట్లాడుతూ ఆకాశానికెత్తేశారు. --శ్వాసిక నటన చూస్తే మీకు భయం వేస్తుంది.. తన పర్ఫార్మెన్స్‌తో అందరినీ ఆకట్టుకుంటుంది-- అని కొనియాడారు. ఆమె ఎంతో గొప్ప నటి అని కొనియాడిన రవితేజ.. ఈ సినిమాలో ఆ పాత్ర ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు. ఒక మాస్ హీరో నోటి నుంచి ఈ స్థాయి ప్రశంసలు రావడం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తించింది. అద్భుతమైన ఎమోషన్స్.. భయపెట్టే పాత్రలో అద్భుత నటనతో శ్వాసిక ప్రేక్షకులను అలరించనున్నారు. మాస్ రాజా రవితేజ ప్రశంసలతో ఈ సినిమాపై.. అలాగే శ్వాసిక పాత్రపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రం ద్వారా శ్వాసిక తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నటిగా మరిన్ని మంచి అవకాశాలను అందిపుచ్చుకుని తన ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తుందని భావిస్తున్నారు.

# 2026లో రౌడీ దర్శనం లేనట్లేనా?


విజయ్ దేవరకొండ కమ్ బ్యాక్ మూవీ కోసం తన అభిమానులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. గీత గోవిందం విజయ్ చివరి క్లీన్ హిట్. ఆ తర్వాత తన సినిమాలన్నీ నిరాశపరిచాయి. విజయ్ దేవరకొండ కమ్ బ్యాక్ మూవీ కోసం తన అభిమానులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. గీత గోవిందం విజయ్ చివరి క్లీన్ హిట్. ఆ తర్వాత తన సినిమాలన్నీ నిరాశపరిచాయి. గత ఏడాది వచ్చిన 'కింగ్డమ్'తో బలంగా వ్యంజుకుంటాడనే అంచనాలు కలిగాయి కానీ.. అది నిజం కాలేదు. ఆ సినిమా ఓ మాదిరిగా ఆడి వెళ్లిపోయింది. ఐతే విజయ్‌కి ఉన్న అదృష్టం ఏంటంటే.. ఎన్ని ఫ్లాపులు ఇచ్చినా తన ఫాలోయింగ్, మార్కెట్ అలాగే కొనసాగుతున్నాయి. క్రేజీ ప్రాజెక్టులు తన చెంతకు వస్తున్నాయి. గత ఏడాది అతను ఒకేసారి రెండు భారీ చిత్రాలను మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అందులో ఒకటి రణబాలి కాగా.. ఇంకోటి రౌడీ జనార్ధన.





వీటిలో మొదటిది సెప్టెంబరులో, రెండోది డిసెంబర్లో రిలీజ్ కావాల్సింది. రెంటికీ రిలీజ్ డేట్లు కూడా ఇచ్చారు. కానీ ఈ రెండూ అనుకున్నట్లుగా విడుదల కావట్లేదు. 'రణబాలి' వాయిదా అని ఇంతకుముందే క్లారిటీ వచ్చేసింది. ఇప్పుడు 'రౌడీ జనార్ధన' సైతం డిసెంబరులో రిలీజ్ కాదని తెలుస్తోంది. 'రణబాలి' ముందే ఆలస్యం కాగా.. హీరోయిన్ రష్మిక మందన్నా గాయంతో మరింత లేట్ అవుతోంది. ఈ సినిమా షూట్ ఇంకా 30 శాతం దాకా మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు 'రౌడీ జనార్ధన' వర్క్ 50 శాతం దాకా బ్యాలెన్స్ ఉందట. ఈ రెంటిలో ఏదీ ఈ ఏడాదిలో పూర్తయి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు లేదు. కాబట్టి రౌడీ దర్శనం కోసం 2027 వరకు ఎదురు చూడాల్సిందే. ఐతే వచ్చే ఏడాది ఈ రెంటితో పాటు మరో చిత్రంతోనూ విజయ్ ప్రేక్షకులను పలకరించే అవకాశముంది. రణబాలి, రౌడీ జనార్ధన వచ్చే ఏడాది ప్రథమార్థంలోనే రిలీజ్ అవుతాయి. 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్‌తో అనౌన్స్ చేసిన సినిమాను సెకండాఫ్‌లో ప్రేక్షకుల ముందుకు తెచ్చే అవకాశముంది. కాబట్టి ఈ ఏడాది సినిమా లేకపోయినా.. వచ్చే ఏడాది విజయ్ అభిమానులను మూడు చిత్రాలతో మురిపించే ఛాన్సుంది.

# అక్కడ మంచి బజ్‌తో మొదలైన 'ఇరుముడి' బుకింగ్స్




మాస్ మహారాజా రవితేజ నటించిన ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా 'ఇరుముడి' ఈ శుక్రవారం గ్రాండ్‌గా థియేటర్లలోకి రాబోతోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.ముఖ్యంగా నార్త్ అమెరికా ప్రీ-సేల్స్ అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో ఇప్పటికే 25ఖ డాలర్లకి పైగా వసూలు చేసి ప్రామిసింగ్ నోట్‌తో ప్రారంభమయ్యాయి. సాధారణంగా రవితేజ సినిమాలకు నార్త్ అమెరికా అంత బలమైన మార్కెట్ కాకపోయినప్పటికీ, ఈ చిత్రంతో అక్కడ భారీ నంబర్స్ నమోదు చేస్తారని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించగా, బేబీ నక్షత్ర రవితేజ కుమార్తెగా కనిపించనుంది. సాయి కుమార్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందించాడు.

# మూడేళ్లయినా వదలని 'బేబీ' సెంటిమెంట్

ఆనంద్ దేవరకొండ కెరీర్ లో 'బేబీ' సినిమా తెచ్చిన మార్పు అంతా ఇంతా కాదు. ఆ సినిమా వచ్చి మూడేళ్లు దాటిపోయినా ఆ సెంటిమెంట్ మాత్రం ఆనంద్ ను ఇంకా వదలడం లేదు.ఆనంద్ దేవరకొండ కెరీర్ లో 'బేబీ' సినిమా తెచ్చిన మార్పు అంతా ఇంతా కాదు. ఆ సినిమా వచ్చి మూడేళ్లు దాటిపోయినా ఆ సెంటిమెంట్ మాత్రం ఆనంద్ ను ఇంకా వదలడం లేదు. ఇప్పుడు లైనప్ లో ఉన్న రెండు ప్రాజెక్టులు చూస్తే ఈ విషయం ఈజీగా అర్థమవుతుంది. అప్పట్లో బేబీ టీమ్ లో పని చేసిన వాళ్లే ఇప్పుడు రెండు వేర్వేరు ప్రాజెక్టులతో ఆనంద్ తో మళ్లీ చేతులు కలిపారు. 2023లో వచ్చిన 'బేబీ' ఆనంద్ థియేట్రికల్ మార్కెట్ ను ఒక్కసారిగా మార్చేసింది. సాయి రాజేష్ డైరెక్ట్ చేసిన ఈ లవ్ స్టోరీకి ఎస్కేఎన్ ప్రొడ్యూసర్ కాగా, ధీరజ్ మొగిలినేని సహ నిర్మాతగా వ్యవహరించారు. ఒక చిన్న సినిమాగా రిలీజైన బేబీ.. కేవలం నాలుగు రోజుల్లోనే 31 కోట్ల గ్రాస్ కొల్లగొట్టి బాక్సాఫీస్ దగ్గర సృష్టించిన సెన్సేషన్ అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే సెంటిమెంట్ తో బేబీ హీరోయిన్ వైష్ణవి చైతన్య మళ్లీ ఆనంద్ తో నటిస్తోంది. ఆదిత్య హాసన్ డైరెక్షన్ లో వీళ్లిద్దరూ కలిసి నటించిన 'ఎపిక్' సినిమా సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రాబోతోంది. బేబీలో హిట్ అయిన ఈ పెయిర్ మూడేళ్ల తర్వాత మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎపిక్ కు మంచి బజ్ తెచ్చిపెట్టింది. అయితే ఇది కూడా బేబీ లాంటి ఇంటెన్స్ లవ్ స్టోరీనా కాదా అనేది రిలీజ్ అయితే కానీ తెలియదు. ఇక మరోవైపు బేబీకి కో ప్రొడ్యూసర్ గా ఉన్న ధీరజ్ మొగిలినేని కూడా ఆనంద్ తో ఓ కొత్త సినిమా ప్లాన్ చేశాడు. 'బలగం' సినిమాకు రైటింగ్ టీమ్ లో పని చేసిన నాగరాజు ఈ చిత్రంతో డైరెక్టర్ గా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నాడు. త్వరలోనే ఈ మూవీ సెట్స్ పైకి వెళ్లనుంది. బలగం లాంటి రూటెడ్ స్టోరీకి పని చేసిన రైటర్ కావడంతో ఆటోమేటిక్ గా ఈ ప్రాజెక్ట్ మీద జనాల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇక్కడ మరో ఆసక్తికరమైన పాయింట్ ఒకటుంది. బేబీ హిట్ అయింది కదా అని అదే టీమ్ అంతా కలిసి మళ్లీ ఒకే సినిమా చేయలేదు. ఎవరికి వాళ్లు విడిపోయి ఆనంద్ తో రెండు డిఫరెంట్ ప్రాజెక్టులు సెట్ చేసుకున్నారు. ఒక పక్క హీరోయిన్ వైష్ణవితో ఎపిక్ చేస్తూనే.. ఇంకో పక్క కో ప్రొడ్యూసర్ ధీరజ్ నిర్మాణంలో కొత్త కథకు ఓకే చెప్పాడు. సీక్వెల్స్ గొడవ లేకుండానే బేబీ టీమ్ కనెక్షన్ ఇలా కంటిన్యూ అవుతోంది. నిజానికి బేబీ తర్వాత ఆనంద్ చేసిన 'గం గం గణేశా' బాక్సాఫీస్ దగ్గర ఆశించిన రిజల్ట్ ఇవ్వలేదు. అందుకే ఇప్పుడు తన లైనప్ ను చాలా జాగ్రత్తగా సెట్ చేసుకుంటున్నాడు. ఎపిక్ తో పాటు 'తక్షకుడు' అనే మరో సినిమా కూడా ఆనంద్ చేతిలో ఉంది. మిడిల్ క్లాస్ మెలోడీస్ తీసిన వినోద్ అనంతోజు డైరెక్ట్ చేసిన ఈ మూవీ డైరెక్ట్ గా నెట్ ఫ్లిక్స్ లోకి రానుంది.



# పిల్లల జీవిత నిర్ణయాలు వారివే..

# పెళ్లి బాధ్యతపై ప్రగతి ఓపెన్ కామెంట్స్!

తెలుగు సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రగతి, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పిల్లల పెళ్లిళ్లు, వారి భవిష్యత్తు నిర్ణయాలపై చేసిన సంచలన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.తెలుగు సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రగతి, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పిల్లల పెళ్లిళ్లు, వారి భవిష్యత్తు నిర్ణయాలపై చేసిన సంచలన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. తన పిల్లల బాధ్యత ఎంతవరకు ఉందో స్పష్టం చేస్తూ, వారు సెటిల్ అయ్యాక పెళ్లి చేసే బాధ్యత తల్లిదండ్రులపై లేదని ఆమె తేల్చి చెప్పారు. ఈ ఆలోచనా విధానం ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్లను ఎంతో ఆలోచింపజేస్తోంది. పిల్లల పెళ్లి వారి ఇష్టం..



నా బాధ్యత కాదు: పిల్లల పెంపకం, వారి పెళ్లిపై ప్రగతి మాట్లాడుతూ.. "కెరీర్ పరంగా వారికి కాళ్లు వచ్చి సెటిల్ అయ్యేంత వరకే పిల్లలు నా బాధ్యత. అంతే తప్ప వాళ్లకు పెళ్లి చేయడం నా బాధ్యత ఎంతమాత్రం కాదు. మానసికంగా, ఆర్థికంగా సిద్ధంగా ఉండి, తమ జీవితంలోకి ఇంకొకరిని భాగస్వామిగా తెచ్చుకోవాలనుకున్నప్పుడు పెళ్లి చేసుకోవడం పూర్తిగా వారి ఇష్టం. తమ పెళ్లి తమకే చేసుకోవడం రానప్పుడు ఇక వారెందుకు పెళ్లి చేసుకోవాలి?" అని ప్రగతి ఓపెన్‌గా స్పష్టం చేశారు. పిల్లలను చూసి గర్వపడుతున్నా: తన పిల్లలే తన ప్రపంచమని ప్రగతి ఆనందం వ్యక్తం చేశారు. తన కొడుకు చదువు పూర్తి చేసుకుని బెంగళూరులో మంచి ఉద్యోగం చేస్తున్నాడని, కూతురు ప్రస్తుతం యూఎస్‌లో ఉన్నత చదువులు చదువుకుంటోందని తెలిపారు. ఇక సమాజానికి సరైన పద్ధతిలో పెంచిన మంచి పిల్లలను అందించాననే సంతృప్తి తనకు ఉందంటూ ఓ తల్లిగా గర్వంగా చెప్పుకొచ్చారు. ఫిట్‌నెస్ పై తగ్గని ఇష్టం సినిమాలతో పాటు పవర్ లిఫ్టింగ్‌పై తనకున్న ఆసక్తిని ప్రగతి పంచుకున్నారు. ఇటీవల అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని నాలుగు రజత పతకాలు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచిన ఆమె, తన ఫిట్‌నెస్ ప్రేమాన్ని చాటుకున్నారు. "నేను జీవితంలో పెళ్లి చేసుకోకపోయినా హ్యాపీగా బతకగలను కానీ, వర్కౌట్స్ చేయకుండా మాత్రం ఒక్క రోజు కూడా ఉండలేను" అని నవ్వుతూ చెప్పారు. చిన్న, పెద్ద సినిమాలపై ప్రగతి అభిప్రాయం: నటన అనేది చిన్న సినిమా అయినా, పెద్ద సినిమా అయినా ఒకేలా ఉంటుందని ప్రగతి అభిప్రాయపడ్డారు. కేవలం బడ్జెట్‌ను బట్టే చిన్న, పెద్ద సినిమాలు అనే తేడా ఉంటుందని, అంతేతప్ప నటీనటులు లేదా దర్శకుల స్థాయిని బట్టి కాదని స్పష్టం చేశారు. ఇక తన కెరీర్‌లో 99 శాతం సినిమాలు విడుదలయ్యాయని, పెద్ద బ్యానర్లలోనే కాక చిన్న సినిమాల్లోనూ నటించానని తెలిపారు. పిల్లల పెళ్లిళ్ల విషయంలో సమాజం విధించే పాతకాలపు పద్ధతులను పక్కన పెట్టి ప్రగతి చెప్పిన మాటలు ఆధునిక తల్లిదండ్రులకు కొత్త ఆలోచనలను రేకెత్తిస్తున్నాయి. ఇక పిల్లలకు స్వేచ్ఛనిస్తూనే, వారిని బాధ్యతాయుతంగా తీర్చిదిద్దిన ప్రగతి ఆలోచనా విధానాన్ని చాలామంది ప్రశంసిస్తున్నారు

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555